ప్రజాశక్తి
బుధవారం 15 ఏప్రిల్ 2024
5
విజయనగరం




పోలీస్ సిబ్బందికి ఎస్‌పి ధన్యవాదాలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా విధులు నిర్వహించిన పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్‌పి ఎం.దీపిక ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌పి ఎం.దీపిక, అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్ జిల్లా వ్యాప్తంగా పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి, భద్రత ఏర్పాట్లను సమీక్షించి, సిబ్బంది, అధికారులకు ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేస్తూ, దిశా నిర్దేశం చేసారు. జిల్లాలో ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించడంలో ప్రతీ ఒక్కరూ కష్టపడి, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికల విధుల్ని సమర్థవంతంగా నిర్వహించారని తెలిపారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు.

ఇవిఎంల్లో అభ్యర్థుల భవితవ్యం



- విజయనగరం జిల్లాలో 81.33శాతం పోలింగ్
- మన్యం జిల్లాలో 77.10 నమోదు
- స్ట్రాంగ్ రూములకు చేరిన ఇవిఎంలు
- 4న ఓట్ల లెక్కింపు
- కూడికలు.. తీసివేతలో నాయకులు
- కార్యకర్తలతో ఎక్కడికక్కడ సమావేశాలు
- అందరిలోనూ గెలుపు ధీమా

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగియడంతో అభ్యర్థుల భవితవ్యం ఇవిఎంల్లో నిక్షిప్తమై ఉంది. ఓటరు ఇచ్చిన తీర్పు జూన్ 4న వెలువడనుంది. ఇవిఎం బాక్సులన్నీ మంగళవారం మధ్యాహ్నానికి కట్టుదిట్టమైన బందోబస్తు నడుమ జెఎన్‌టియు ఇంజినీరింగ్ వర్శిటీ, జొన్నాడ వద్ద లెండి ఇంజినీరింగ్ కాలేజీలోని రిషప్షన్ కేంద్రాలకు పూర్తిస్థాయిలో చేరాయి. బొబ్బిలి, విజయనగరం నియోజకవర్గాల ఓట్లు జెఎన్‌టియులోను, మిగిలినవి లెండి కాలేజీలోనూ భద్రపరిచారు.

విజయనగరం జిల్లాలో మొత్తం 15,52,921 మంది ఓటర్లకు గాను 12,71,173 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు జిల్లాలో 81.33శాతం నమోదైంది. అత్యధికంగా నెల్లిమర్ల నియోజకవర్గంలో 88.25 శాతం ఓట్లు పోలయ్యాయి. అత్యల్పంగా విజయనగరం నియోజకవర్గంలో 71.84 శాతం నమోదైంది. పార్వతీపురం మన్యం జిల్లాలో మొత్తం ఓటర్లు 7,83,440 మందికి గాను 6,04,064 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అత్యధికంగా కురుపాం నియోజకవర్గంలో 78.54 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, అత్యల్పంగా పాలకొండలో 75.26శాతం ఓటింగ్ నమోదైంది. కౌంటింగ్ రోజున విజయనగరం లోక్‌సభ ఎన్నికల ఫలితాలు లెండీలోనే ప్రకటిస్తారు. పార్వతీపురం మన్యంలోని పార్వతీపురం, కురుపాం, పాలకొండ, సాలూరు నియోజకవర్గాల కౌంటింగ్ పార్వతీపురంలోని ప్రభుత్వ ఉద్యాన కళాశాలలో జరుగుతాయి. ఇవిఎంలు కూడా అక్కడికే తరలించి భద్రపర్చారు. పోలింగ్ ముగిసిన నేపథ్యంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ పోటీలో ఉన్న అభ్యర్థులు మంగళవారం సమావేశాలు ఏర్పాటు చేసుకొని గ్రామాలవారీగా ఓట్ల సరళిని బట్టి అంచనాలు వేశారు. ముఖ్యంగా ప్రాధాన పార్టీలుగావున్న వైసిపి, టిడిపి అభ్యర్థులు, వారి తరపున ఎన్నికల్లో పనిచేసిన నాయకులు కూడికలు, తీసివేతలలో తలమునకలయ్యారు. బూత్‌ల వారీ వివరాలు రప్పించుకొని, ఏ కేంద్రంలో తమ పార్టీకి ఎన్ని ఓట్లు వస్తాయి. ప్రత్యర్థికి వచ్చే ఓట్లు ఎన్ని బేరీజు వేసుకుంటున్నారు. ఒకటికి పదిసార్లు అంచనాలు వేస్తున్నారు. ఎవరికి వారే దీమాలు వ్యక్తం చేసుకుంటున్నారు. నియోజక వర్గాల వారీగా ఎన్ని ఓట్లు పోలయ్యా యనేది మంగళవారం రాత్రి వరకూ తేలలేదు. అంచనాలు వాటిపైనే ఆధార పడివుండడంతో రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు, నాయకులు వాటికోసం కళ్లు కడగండ్లు కాసేలా ఎదురు చూశారు.

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఎక్కువ అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైసిపి, టిడిపి అభ్యర్థుల మధ్య గట్టిపోటీ కనిపిస్తోంది. వివిధ సంక్షేమ పథకాలు అందుకున్న మహిళలు, పింఛన్లు అందుకున్న వృద్ధులు, వికలాంగులు, వింతవులు తమకే ఓట్లు వేశారన్న ఆశాభావం వైసిపి నాయకుల నోట వినిపిస్తోంది. కానీ, ఈ ఎన్నికల్లో యువకులు, అందులోనూ కొత్త ఓటర్లు, ఉద్యోగులు, నిరుద్యోగులు, వలసకుటుంబాల ఓట్లు గెలుపు, ఓటములను నిర్దేశించనున్నాయి. వీటిలో ఎక్కువగా టిడిపికి పడడ్డాయనేది ఆ పార్టీ నాయకులు విశ్వసిస్తున్నారు. ఈసారి సుదూర ప్రాంతాల్లోవుంటున్న వలస ఓటర్లు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఇరు పార్టీలకు చెందిన నాయకులు వీరిని రప్పించేందుకు ఏర్పాట్లు చేసినప్పటికీ ఓట్లు ఎవరికి వేశారన్నది అనుమానమే.

ఉమ్మడి విజయనగరం జిల్లాలో నియోజకవర్గాల వారీగా పోలింగ్ వివరాలు

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైనవి	శాతం
విజయనగరం	2,57,205	1,84,787	71.84
రాజాం	2,27,503	1,72,906	76.00
బొబ్బిలి	2,31,232	1,85,775	80.34
చీపురుపల్లి	2,05,484	1,71,533	83.48
గజపతినగరం	2,05,484	1,77,612	86.44
నెల్లిమర్ల	2,13,551	1,88,456	88.25
శృంగవరపుకోట	2,22,475	1,90,104	85.45
పాలకొండ	1,95,020	1,46,781	75.26
కురుపాం	1,94,114	1,52,450	78.54
పార్వతీపురం	1,89,817	1,48,502	78.23
సాలూరు	2,04,489	1,56,331	76.45



- పోలింగ్ సిబ్బంది రెమ్యునరేషన్‌లో కోత
- ఊసురోమన్న ఉద్యోగులు
- ఉపాధి కూలీయే నయమంటూ ఆవేదన
- భోజనాలూ అరకొరే..
- పార్వతీపురం మన్యంలోనూ ఇదే పరిస్థితి

అరకోటి హాంఫట్?

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో సుమారు 13,661 మంది పిఒలు, ఎపిఒలు, ఒపిఒలు విధులు నిర్వహించారు. వీరిలో పిఒలు 2290 మంది, ఎపిఒలు 2306, ఒపిఒలు 9065 మంది ఉన్నారు. వీరు కాకుండా సెక్టార్ ఆఫీసర్లు 225, నోడల్ అధికారులు 16 మంది, మైక్రో ఆబ్జర్వర్లు 445, బిఎల్‌ఒలు 1847, ఇవిఎంల స్వీకరించే సిబ్బంది 728మంది ఉన్నారు. పిఒ, ఎపిఒలు మూడు రోజులు పాటు శిక్షణతో పాటు రెండు రోజులు పాటు పోలింగ్ విధులు, మంగళవారం మధ్యాహ్నం వరకు ఇవిఎంల అప్పగింతతో మొత్తంగా ఆరు రోజులు పాటు పనిచేశారు. ఒపిఒలకు శిక్షణ లేనందున మూడు రోజులు పాటు పోలింగ్ విధులు నిర్వహిస్తున్నట్లు లెక్క. పిఒ, ఎపిఒలకు రోజుకు రోజుకు రూ.350 చొప్పున, ఒపిఒలకు రోజుకు 250 చొప్పున చెల్లించాలని ఎన్నికల సంఘం జారీ చేసిన సర్క్యులర్‌లో పేర్కొంది. ఈ లెక్కన పిఒలు, ఎపిఒలకు ఆరు రోజులుకు టిఎ, డిఎలతో కలిపి రూ.2100, ఒపిఒలకు రూ.750 చొప్పున చెల్లించాల్సి ఉంది. కానీ అధికారులు పిఒ, ఎపిఒలకు రూ.1750, ఒపిఒలకు రూ.500 మాత్రమే చెల్లించారు.

> విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని ఎన్నికల సిబ్బందికి ఇచ్చే రెమ్యునరేషన్‌లో అధికారులు కోతపెట్టారు. ఇలా కోతపెట్టిన మొత్తం విజయ నగరం జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.50లక్షలు వరకు, హాంఫట్ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మూడు రోజులుపాటు శిక్షణ, మరో మూడు రోజులు పాటు పోలింగ్, ఇవిఎంల అప్పగింత పనులు చేసిన సిబ్బందికి కుచ్చుటోపీ పెట్టారు. ఈనేపథ్యంలో అధికారుల తీరుపై ఉద్యోగులు మండిపడు తున్నారు. ఉద్యోగులకు అరకొర మొత్తం చేతిలో పెట్టి ఇళ్లకు పంపడంపట్ల జిల్లా వ్యాప్తంగా తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది.

పోలింగ్ ముగిసిన తరువాత సెక్టోరల్ అధికారులు వారికి ఆమొత్తాన్ని చేతిలో పెట్టడంతో చాలాచోట్ల వారంతా తీవ్ర ఆవేదన చెందారు. మూడు రోజులు పాటు విధులు నిర్వహిస్తే రోజుకు రూ. 166 చొప్పున రూ.500 చెల్లించడమేమిటని ప్రశ్నించారు. వీటికి బదులు ఉపాధి కూలీయే నయమని ఆవేదన చెందారు. దీంతో అధికారులు తామేమీ చేయలే మంటూ ఆ మొత్తాన్ని సిబ్బంది చేతిలో పెట్టి వెళ్లిపోయారు. ఈలెక్కన జిల్లా మొత్తంగా రూ.38లక్షల, 74వేల, 850ను అధికారులు మింగేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు మిగతా సిబ్బందికికూడా చెల్లింపుల్లో కోత పెట్టినట్లు తెలిసింది. అంతేకాకుండా పోలింగ్‌రోజున పోలింగ్ బూత్‌ల్లో అందించిన నాణ్యత లేని భోజనాల్లో భారీగా వెనుకేసుకున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఈ లెక్కన జిల్లా మొత్తంగా సుమారు రూ.50లక్షలు వరకు హాంఫట్ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొనడంతో అధికారుల తీరుపై ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మరోవైపు పోలింగ్ విధులకు వెళ్లిన సిబ్బందికి ఆదివారం రాత్రి, సోమవారం సరైన భోజనాలు లేక అల్లాడిపోయారు. ఎప్పుడో తయారు చేసిన భోజన ప్యాకెట్లు ఇవ్వడం, అవి కూడా పాడవ్వడంతో పలుచోట్ల సిబ్బంది తినేందుకు ఇబ్బంది పడ్డారు. సోమవారం అర్ధరాత్రి ఇవిఎంలను తీసుకొని రిసెప్షన్ కేంద్రాలకు చేరుకున్నారు. వాటిని అక్కడ అప్పగించేందుకు సుమారు మూడు నుంచి నాలుగు గంటల సమయం పట్టడంతో రాత్రి 12 తరువాతే భోజనాలు చేయాల్సి వచ్చింది. అనంతరం స్వగ్రామాలకు వెళ్లేందుకు రవాణా సదుపాయం లేక నానా అగచాట్లు పడ్డారు.

తహశీల్దార్లకు తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి-పాలకొండ

సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఇవిఎంలు, వివి ప్యాట్లను పార్వతీపురంలో అప్పగించి పాలకొండ, సీతంపేట తహశీల్దార్లు వరహాలు, మహేశ్వరరావు కారులో పాలకొండ వస్తున్నారు. వీరు ప్రయాణిస్తున్న కారు టైరు పాలకొండ మండలం రాజుపేట కూడలికి దగ్గరకు వచ్చేసరికి పేలి ప్రమాదం జరిగింది. అదే సమయానికి ఎన్నికల విధులు ముగించుకుని అటుగా వస్తున్న పాలకొండ డిఎస్‌పి కృష్ణారావు ప్రమాదాన్ని గుర్తించి కారులో చిక్కుకున్న ఇద్దరు తహశీల్దార్లను వెంటనే బయటకు తీశారు. గాయాలపాలైన ఇద్దరు తహశీల్దార్లను వెంటనే పాలకొండ ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించారు.

నియోజకవర్గంలో పెరిగిన 18వేల ఓట్లు

- గత ఎన్నికల్లో 1,65,111 ఓట్లు
- ఈ ఎన్నికల్లో 1,83,232 ఓట్లు
- మహిళా ఓటర్లే అధికం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం నియోజకవర్గంలో 2024 సాధారణ ఎన్నికల్లో పోటీ చేసిన నాయకులకు ఓటర్లు దడ పుట్టించారు. గత ఎన్నికలతో చూసుకుంటే ఈ ఎన్నికల్లో ఎక్కువమంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2014 ఎన్నికల్లో 71.28 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకోగా, 2019లో 70.86 శాతం ఓట్లు నమోదయ్యాయి. తాజా ఎన్నికల్లో 71.49శాతం ఓట్లు పోలయ్యాయి. గత ఎన్నికలతో పోలిస్తే పోలింగ్‌శాతం స్వల్పంగా పెరిగింది. 2019 ఎన్నికల్లో విజయనగరం నియోజకవర్గంలో 1,65,111 ఓట్లు నమోదుకాగా, 1600 వరకు పోస్టల్ బ్యాలెట్లు పోలయ్యాయి.తాజా ఎన్నికల్లో 1,83,879 ఓట్లు నమోదయ్యాయి. వీటితో పాటు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 4211ఓట్లు నమోదయ్యాయి. అంటే గత ఎన్నికలతో పోలిస్తే 22,379ఓట్లు పెరిగాయి. ఉదయం 11 గంటల వరకు పోలింగ్ కేంద్రాలు వద్ద పెద్ద సంఖ్యలో వచ్చి ఓట్లు వినియోగించుకున్నారు. అదే విధంగా సాయంత్రం కూడా పెద్ద సంఖ్యలో ఓటర్లు రావడంతో రాత్రి 11గంటలు వరకు నాలుగు పోలింగ్ కేంద్రాలలో ఓటింగ్ జరిగింది. సాయంత్రం ఓటింగ్ లో పాల్గొన్న వారు బయట ప్రాంతాల నుంచి వచ్చిన వారు అధికంగా ఉండటం విశేషం.

ఎవరి లెక్కలు వారివే..

గత ఎన్నికల కంటే సుమారు 22వేలపైగా ఓట్లు పెరగడంతో ప్రధాన పార్టీలు అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది. దీంతో ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు 260 బూత్‌ల్లో పోలింగ్ జరిగిన విధానం, ఓటర్లను రప్పించుకున్న దానిపై ఆరాతీస్తూ లెక్కలు వేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. పోలింగ్ బూత్‌ల వారీగా లెక్కలు ప్రారంభించారు. అయితే పెరిగిన ఓట్లు ప్రభావం. ఎవరి మీద పడుతుందోనన్న భయం వారిలో నెలకొంది. అధికార పార్టీ నాయకులు తమ ఓట్లు వృథా కాకుండా వేయించుకోవడం ఫలితంగా ఓట్లు పెరిగాయని భావిస్తున్నారు. ప్రతిపక్ష తెలుగుదేశం నాయకులు ప్రభుత్వ వ్యతిరేకత ఓట్లు పెరగడానికి కారణమని అంటున్నారు. అధిక సంఖ్యలో యువత, మహిళలు, వృద్ధులు సైతం ఓట్లు వినియోగించుకున్నారు. అయితే అధికార వైసిపి పార్టీ నాయకులు మహిళలు, వృద్ధుల ఓట్లు అధికంగా తమకు పడ్డాయని, గెలుపు ఖాయమని భావిస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేకత పెద్దఎత్తున ఉండడంతో తామే గెలుస్తామని టిడిపి అభ్యర్థి అంటున్నారు.ఉద్యోగులు, యువత, వలస ఓటర్ల, ఇతర ప్రాంతాలు నుంచి వచ్చి ఓట్లు వేశారనే నమ్మకంతో కూటమి పార్టీలు ఉన్నాయి. వాస్తవానికి మహిళలు అత్యధికంగా 94,196 మంది, పురుషులు 89029 మంది ఓట్లు వేశారు. పురుషుల కంటే మహిళలు 4200 ఓట్లు అధికంగా నమోదయ్యాయి. దీంతో ప్రధాన పార్టీలు అభ్యర్థులు ఎవరి అంచనాలు వారు వేసుకునే పనిలో పడ్డారు. జూన్ 4 తేదీన అభ్యర్థుల భవితవ్యం తేలనుంది.



ఓటు హక్కును వినియోగించుకుంటున్న ఓటర్లు





లెండీ కళాశాలలోని రిసెప్షన్ కేంద్రంలో ఇవిఎంల అప్పగింతకు వేచి ఉన్న ఉద్యోగులు

ఇవిఎంల అప్పగింతలో అగచాట్లు

- మధ్యాహ్నం 12గంటల వరకు ఇవిఎంల తరలింపు
- రెండు గంటల పాటు ట్రాఫిక్ జామ్
- తిరుగుముఖంలో బస్సులు లేక అగచాట్లు
- అర్ధరాత్రి రహదారిపై పడిగాపులు
- లెండీ కళాశాల నుంచి విజయనగరానికి నడక
- రవాణా సౌకర్యం కల్పించని అధికారులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఎన్నికల పోలింగ్ ముగిసిన అనంతరం ఇవిఎంలను రిసెప్షన్ సెంటర్లకు అప్పగించేందుకు పోలింగ్ సిబ్బంది పడరాని పాట్లు పడ్డారు. పోలింగ్ కేంద్రాల నుంచి రాత్రి 7గంటల నుంచి ప్రారంభమైన ఎంవిఎంల తరలింపు ప్రక్రియ మంగళవారం మధ్యాహ్నం 12గంటల వరకు కొనసాగింది. జిల్లాలోని నాలుగైదు చోట్ల సోమవారం రాత్రి 2గంటల వరకు పోలింగ్ కొనసాగడంతో ఆ ఇవిఎంలను రిసెప్షన్ కేంద్రాలకు రావడం ఆలస్యమైంది.

జిల్లాలోని 7నియోజకవర్గాలకు గాను విజయనగరం, బొబ్బిలి నియోజకవర్గాలకు సంబంధించి జెఎన్‌టియు కళాశాలలోను, రాజాం, చీపురుపల్లి నెల్లిమర్ల , గజపతినగరం, ఎస్.కోట నియోజకవర్గ కేంద్రాల ఇవిఎంలను అప్పగించేందుకు లెండి కళాశాలలో రిసెప్షన్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ఐదు నియోజకవర్గాల కేంద్రాలకు సంబంధించిన ఇవిఎంలను అప్పగించేందుకు ఒకేచోట రిసెప్షన్ కేంద్రం ఏర్పాటు చేయడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు అన్ని పోలింగ్ కేంద్రాల్లోను ఇవిఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ముగిసింది.

గతంలో నియోజకవర్గ కేంద్రంలోనే రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేసి, అక్కడే ఇవిఎంలను స్వీకరించి, అనంతరం అక్కడి నుంచి స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించేవారు. కానీ ఈసారి ఒకేచోట ఏర్పాటు చేయడంతో సిబ్బంది ఇబ్బంది పడ్డారు. కొత్తవలస, ఎస్.కోట, భోగాపురం, గుర్ల, రాజాం తదితర మండలాల నుంచి మంగళవారం ఉదయం 10గంటల వరకు ఇవిఎంలను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. జొన్నాడ వద్ద జాతీయ రహదారి నుంచి లెండీ కళాశాలకు వెళ్లేందుకు చిన్నపాటి రహదారి మాత్రమే ఉండడంతో సోమవారం రాత్రి 9గంటల నుంచి మంగళవారం ఉదయం 10గంటల వరకు ఇవిఎంలను తరలిస్తున్న వందలాది బస్సులు నిలిచిపోయాయి. ఒక్కసారిగా వందల సంఖ్యలో బస్సులు చేరుకోవడంతో లోపలకు వెళ్లే తోవలేక ఒక బస్సును ఇంకోబస్సు తప్పించు కోలేని పరిస్థితి ఏర్పడింది.దీంతో రిసెప్షన్ సెంటర్లుకు ఇవిఎంలను అందించడానికి 2గంటల సమయం పట్టింది. తీరా రిసెప్షన్ కేంద్రాలకు వచ్చిన తరువాత ఇవిఎంలను, మెటీరియల్‌ను అప్పగించేందుకు బారులు తీరారు. రిసెప్షన్ కేంద్రాల వద్దే సుమారు నాలుగు నుంచి ఐదు గంటల సమయం పట్టింది. మరోవైపు రెండు రోజులు పాటు పోలింగ్ సిబ్బందికి సక్రమమైన భోజనాలు లేకపోవడంతో అల్లాడిపోయారు. మెటీరియల్‌ను అప్పగించిన తరువాత ఇళ్లకు చేరుకునేందుకు అధికారులు ఎటువంటి రవాణా సౌకర్యం కల్పించక పోవడంతో అర్ధరాత్రి ఉద్యోగులు ఇబ్బందులకు గురయ్యారు. రిసెప్షన్ కేంద్రాల నుంచి నియోజకవర్గ కేంద్రాలకు చేరుకునేందుకు ప్రత్యేకంగా ఉచిత బస్సులు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారులు ప్రకటించినప్పటికీ అమలు చేయలేదు. దీంతో ఉద్యోగులు గంటల తరబడి వాహనాల కోసం జాతీయ రహదారిపైనే వేచి ఉండాల్సి వచ్చింది. జిల్లా కేంద్రానికి చెందిన కొంతమంది మహిళా ఉద్యోగులు తన కుటుంబ సభ్యులకు ఫోన్లు చేయడంతో వారు వచ్చి ద్విచక్ర వాహనాలు,కార్లలో తీసుకెళ్లారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు జొన్నాడ నుంచి నడుచుకుంటూ ఆర్‌టిసి విజయనగరం చేరుకున్నారు. ఎన్నికల అధికారులు సక్రమంగా సౌకర్యాలు ఏర్పాటు చేయకపోవడం పట్ల ఉద్యోగులు తీవ్ర అసంతప్తి వ్యక్తం చేశారు. రెమ్యునరేషన్ సైతం సక్రమంగా ఇవ్వకపోవడంతో అధికారులు తీరుపై మండిపడ్డారు.



స్ట్రాంగ్ రూం వద్ద ఉన్న పోలీసు బందోబస్తు

స్ట్రాంగ్ రూముల్లో ఇవిఎంలు భద్రం

ఓటింగ్ ప్రక్రియ ముగియడంతో కట్టుదిట్టమైన భద్రత నడుమ ఇవిఎంలను స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. లెండి ఇంజనీరింగ్ కళాశాలలో చీపురుపల్లి, రాజాం, నెల్లిమర్ల, ఎస్.కోట, గజపతినగరం నియోజకవర్గాల ఇవిఎంలను, జెఎన్‌టియు గురజాడ విశ్వవిద్యాలయంలో విజయనగరం, బొబ్బిలి నియోజకవర్గాల ఇవిఎంలను భద్రపరిచారు. జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి, ఆయా నియోజకవర్గాల సాధారణ ఎన్నికల పరిశీలకులు హనీష్ చాబ్రా, తలాత్ పర్వేజ్ ఇక్బాల్ రోహెల్లా పర్యవేక్షణలో, నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, అభ్యర్థులు, వారి ప్రతినిధుల సమక్షంలో ఇవిఎం స్ట్రాంగ్ రూమ్‌లకు సీళ్లు వేశారు. స్ట్రాంగు రూములవద్ద సిసి కెమేరాలు, బారికేడింగ్, పటిష్టమైన భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. వీటికి సమీపంలోనే కౌంటింగ్ హాళ్లను సిద్ధం చేసి, జూన్4న ఓట్ల లెక్కింపు చేయనున్నారు.



స్ట్రాంగ్ రూమ్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి

ఎన్నికల నిర్వహణలో వైఫల్యం

- డబ్బులు మిగల్చడంపై ఉన్న శ్రద్ధ పోలింగ్ నిర్వహణపై ఏదీ?
- మరుసటిరోజు వరకు పోలింగ్
- మంగళవారం రాత్రి వరకు పోలింగ్ వివరాలు వెల్లడించలేకపోయిన అధికారులు
- రెండురోజులపాటు నిద్రాహారాలు లేక అలసిపోయిన సిబ్బంది

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

సాంకేతిక పరిజ్ఞానం పెరిగింది. అందుకనుగునంగా నైపుణ్యత పెంచేందుకు శిక్షణా తరగతులపేరిట రూ.లక్షలు ఖర్చుచేశారు. అంతకు మించి గత ఎన్నికలతో పోలిస్తే జిల్లా పరిధి తగ్గింది. గిరిశిఖర గ్రామాలంటూ పెద్దగా లేనే లేవు. కొట్లాటలు, గొడవలు లాంటి ఘటనలు ఆటంకం సృష్టించాయా? అంటే అదీ లేదు. అయినా సరే... పోలింగ్ మాత్రం అధికారులు సమయానికి ముగించలేకపోయారు. పోలింగ్‌పై జిల్లా కలెక్టర్ (కలెక్టర్) తగిన పర్యవేక్షణ చేయకపోవడమే ఇందుకు కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి. కలెక్టరేట్ కార్యాలయం నుంచి ఆమె మోనటరింగ్ చేయడం మినహా ఒక్క పోలింగ్ కేంద్రాన్ని కూడా సందర్శించి సిబ్బందిని అప్రమత్తం చేయలేదు. ఉదయం 11గంటల వరకు పోలింగ్ మందకొడిగా సాగినప్పటికీ కనీసం ఒక్క పోలింగ్ కేంద్రాన్ని కూడా సందర్శించకపోవడం ఇందుకు మచ్చుతునక. నియోజకవర్గాల పరిధిలోని ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్లు (ఆర్‌ఒలు) మరింత ఉదాసీనంగా వ్యవహించారు. దీంతో, జిల్లాలో మునుపెన్నడూ లేని విధంగా ఆలస్యంగా పోలింగ్ జరిగింది. చాలా చోట్ల ఇవిఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యమైందని సిబ్బంది చెబుతున్నారు. పలు కేంద్రాల్లో అర్ధరాత్రి వరకు పోలింగ్ జరిగింది. భోగాపురం, గుర్ల మండలం చింతలపేట, కొత్తవలస మండలంలోని మరో గ్రామంలో మంగళవారం తెల్లవారి 2 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. దీంతో, ఏయే నియోజకవర్గంలో ఎన్ని ఓట్లు నమోదు అయ్యాయనే వివరాలు మంగళవారం రాత్రి వరకు ఇవ్వలేకపోయారు. పోలింగ్ సిబ్బంది విధులు ముగించేసరికి మంగళవారం సాయంత్రం 4గంటలు కావచ్చింది. ఇందుకు తగ్గట్టు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకుగానీ, సిబ్బందిగానీ తగిన ఏర్పాట్లు చేయలేకపోయారు. వృద్ధులు, వికలాంగుల సౌకర్యార్థం రూ.లక్షలు ఖర్చుచేసి కొనుగోలు చేసిన వీల్ ఛైర్లు ఒక్క గంట కూడా గడవకముందే మరమ్మతులకు గురయ్యాయి. చాలా చోట్ల అసలు కానరాలేదు. చాలా పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్‌అంతరాయం కలిగి ఇబ్బందులు పడ్డారు. సమస్యాత్మక కేంద్రాలు, పోలీసులు భద్రత తదితర అంశాలపై మీడియా ముందస్తుగా ప్రశ్నించినప్పటికీ ఎన్నికల నిబంధనల పేరిట దాటవేశారు. తీరా జిల్లాలోని పోలింగ్ శాతం పెరిగిందా? అంటే అటువంటిదేమీ కనిపించడం లేదు. తగిన ప్లానింగ్, పర్యవేక్షణ లేకపోవడమే ఇందుకు కారణమని జనం సర్వత్రా చర్చించుకుంటున్నారు. ప్రశాంతతకు మారుపేరుగావున్న జిల్లాలో ఇంతటి విఫలం జరగడం పట్ల జనం విస్తుపోతున్నారు.


అర్ధరాత్రి వరకూ క్యూలైన్లలో ఉన్న ఓటర్లు

అప్పన్నపేటలో 18 గంటల పాటు పోలింగ్

తెల్లవారు జామున 3గంటల వరకు సిబ్బంది ఇక్కట్లు

ప్రజాశక్తి భోగాపురం

మండలంలోని భోగాపురం పంచాయతీ అప్పన్నపేట పోలింగ్ కేంద్రంలో (230) 18 గంటల పాటు పోలింగ్ జరిగింది. ఉదయం 7గంటలకు ప్రారంభం కావాల్సిన పోలింగ్ ఇవిఎంలు మొరాయించడంతో రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభమైంది. మరోవైపు సాయంత్రం ఎక్కువ మంది ఓటర్లు ఓటేసేందుకు రావడంతో పోలింగ్ సమయం ముగిసేసరికి సుమారు 5వందల మంది ఓటర్లు క్యూలో ఉండడంతో వారంతా ఓటు వేసేందుకు తెల్లవారుజామున 3గంటలైంది. దీంతో పోలింగ్ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. . ఈ పోలింగ్ కేంద్రంలో 1274 ఓట్లు ఉన్నాయి. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి వరుసలో ఉన్న సుమారు 500 మందికి అధికారులు టోకెన్లు జారీచేశారు. పోలింగ్ కేంద్రం చిన్నదిగా ఉండడం, ఆలస్యం కావడంతో ఓటర్లంతా ఒకేసారి వెళ్లేందుకు ప్రయత్నించడంతో రద్దీ నెలకొంది. పోలింగ్ ఆలస్యం కావడంతో వైసిపి, జనసేన ఎమ్మెల్యే అభ్యర్థులు బడ్డుకొండ అప్పలనాయుడు, లోకం మాధవి పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చి పరిస్థితులను పరిశీలించారు. ఈనేపథ్యంలో పిఒ ఫిర్యాదుతో తాహశీల్దార్ శ్యాం ప్రసాద్, ఎంపిడిఒ చంద్రకళ, డిప్యూటీ తాహశీల్దార్ శ్రీనివాసరావు, సిఐ కుమార్ అక్కడికి చేరుకున్నారు. పోలింగ్ కేంద్రం ప్రాంతంలో ఇతరులు ఎవరూ ఉండవద్దని, ఓటర్లు మాత్రమే ఉండాలని హెచ్చరించారు. పోలింగ్‌ను వేగవంతం చేసే ప్రయత్నం చేశారు. రాత్రి 11 గంటల ప్రాంతంలో డిఎస్‌పి ఆర్.గోవిందరావు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.

అర్ధరాత్రి 12 గంటలకు మరో ఇవిఎం ఏర్పాటు

అర్ధరాత్రి 12 గంటలు దాటాక తేదీ మారిపోతుండడంతో అధికారులు వెంటనే మరో ఇవిఎంను ఏర్పాటు చేశారు. అప్పటికే పోలింగ్ కేంద్రంలో మరో 70 మంది ఓటర్లు వరుసలో ఉన్నారు. అక్కడ నుంచి మంగళ వారం తెల్లవారుజామున ఒంటి గంట వరకు పోలింగ్ కొనసాగింది. అనంతరం డెంకాడ మండలంలోని లెండి కళాశాలకు ఇవిఎంలను తరలించారు. అక్కడ రద్దీగా ఉండడంతో ఉదయం 11గంటల ప్రాంతంలో ఇవిఎంలను రిసెప్షన్ కేంద్రంలో అప్పగించారు. దీంతో అధికారులు, పోలింగ్ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

ఆసక్తి చూపని ఓటర్లు

2,27,503 ఓట్లుకు 1,71,836 పోలింగ్

55,667 మంది ఓటు హక్కుకు దూరం

ప్రజాశక్తి- రేగిడి

రాజాం నియోజకవర్గంలో రాజాం మండలంతో పాటు రేగిడి, వంగర, సంతకవిటి మండలాల్లో 284 పోలింగ్ కేంద్రాలలో 2,27,503 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవలసి ఉండగా సోమవారం జరిగిన పోలింగ్‌లో 1,71,836 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో 75.82శాతం పోలింగ్ నమోదయింది. అయితే పర్సంటేజ్ ప్రకారం మహిళలు కంటే పురుషులు 856 ఓట్లు ఎక్కువగా నమోదయ్యాయి. 55,667 మంది ఓటు హక్కును వినియోగించుకోలేదని లెక్కల్లో తేలింది. దీనిని బట్టి చూస్తే నియోజకవర్గంలో ఓటర్లు ఓటు హక్కుపై ఆసక్తి చూపలేదని తెలుస్తుంది..

సుప్రీం కోర్టులో స్పెషల్ లోక్ అదాలత్

ప్రజాశక్తి- బొబ్బిలి

సుప్రీంకోర్టులో జూలై 29 నుంచి ఆగస్టు 3 వరకు స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి అరుణశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్, క్రిమినల్, చెక్ బౌన్స్, ఇన్సూరెన్స్ కేసులు, రాజీ అయ్యే అన్ని రకాల కేసులు, సర్వీస్ తగాదాలను లోక్ అదాలత్‌లో పరిష్కరిస్తామన్నారు. లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

మొక్కలు నాటడం సాంప్రదాయం

ప్రజాశక్తి - వేపాడ

గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బొద్దాం పసలమ్మ తల్లి గుడి ఆవరణలో నలబై కొబ్బరి మొక్కలు నాటారు. పైడితల్లి అమ్మ, వీర గౌరమ్మ, వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయాల వద్ద నాటేందుకు 66 కొబ్బరి మొక్కలను కేటాయించారు. హైదరాబాద్‌కు చెందిన గెంటేల యుగంధర్ కళ్యాణి దంపతుల 54వ పెళ్ళి రోజు సందర్భంగా వారి కుమారుడు కేశవ్ సహకారంతో ఈ కొబ్బరి మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. జియో వ్యవస్థాపకులు బి.రామకృష్ణ మాట్లాడుతూ శుభ కార్యాల్లో మొక్కలు నాటడం మన సాంప్రదాయం అన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటడం వల్ల పర్యావరణానికి మేలు చేయగలమన్నారు. సిమ్ సంస్థ డైరెక్టర్ వై. విజయలక్ష్మి, జియో బొద్దాం శాఖ కార్యదర్శి కర్రి శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు అరిగి సత్యన్నారాయణ, జనపరెడ్డి గోవింద, జనపరెడ్డి అప్పారావు, గొరపల్లి నూకరాజు, ముమ్మాన సత్తి బాబు, నారంశెట్టి అప్పన్న, ద్వారపూడి సన్యాసిరావు, బి.హృషీకేశ్, లాస్యశ్రీ, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా మరిడి మాంబ జాతర

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బొద్దాంలో గ్రామ దేవత మరిడిమాంబ జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తి భావంతో అమ్మవారిని వీధులలో ఊరేగిస్తూ భారీ మందు గుండు సామగ్రి కాల్చారు. సర్పంచ్, ఎంపిటిసి, గ్రామ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని అంగరంగ వైభంగా నిర్వహించారు.

మేధస్సు పెంచుకునేందుకే సంగీతం

ప్రజాశక్తి-విజయనగరం కోట

మేధస్సు పెంపొందించుకోవడానికి సంగీతం ఒక సాధనమని డాక్టర్ మండపాక రవి అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యాన మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రముఖ మృదంగ విద్వాంసులు మండపాక రవి మాట్లాడారు. రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ కృష్ణశాంతి,కార్యదర్శి నీతా విజ్వాణి, డిఎన్ఆర్ స్కూల్ ప్రెసిడెంట్ ఊసిరికల చంద్రశేఖర్ రావు, సభ్యులు సుధాకర్, రొటేరియన్లు, సంగీత అభిమానులు డాక్టర్ రవిని ఘనంగా సత్కరించారు.


మాట్లాడుతున్న కలిశెట్టి అప్పలనాయుడు, అదితి గజపతిరాజు

ఓటర్లకు ప్రత్యేక ధన్యవాదాలు : కలిశెట్టి

ప్రజాశక్తి- వియజనగరం కోట

ప్రజలందరూ స్వచ్ఛందంగా వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని కూటమి ఎమ్‌పి అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక అశోక్ బంగ్లా టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ సోమవారం జిలా ్లవ్యాప్తంగా జరిగిన పోలింగ్‌లో ఓటింగ్ అధిక శాతం జరిగినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. విజయనగరం నియోజకవర్గంలో గుంకలం గ్రామంలో అందరూ బ్లైండ్ అని చెప్పి వైసిపి వారు ఓట్లు వేయడానికి ప్రయత్నించారని దాన్ని తిప్పి కొట్టి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఈ ఎన్నికల్లో అత్యధికంగా వలస కార్మికులు వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడబోతుందని ఆశాబావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జనసేన రాష్ట్ర

ఇరువురిలోనూ కలవరం

- చీపురుపల్లిలో అంతు చిక్కని పోలింగ్ సరళి
- పింఛనర్లు, మహిళా ఓటర్లపై అధికార పార్టీ ధీమా
- యువ ఓటర్లు, 'సూపర్ సిక్స్' పై టిడిపి ఆశలు
- గతం కంటే పెరిగిన పోలింగ్ శాతం

ప్రజాశక్తి- చీపురుపల్లి

చీపురుపల్లి నియోజకవర్గంలో ఓటర్ నాడి అంతు చిక్కడం లేదు. గతంలో కన్నా పోలింగ్ అధికంగా నమోదు కావడం, మహిళా ఓట్లు, యువ ఓటర్ల పోలింగ్ శాతం గణనీయంగా పెరగడం వంటి పరిణామాలతో ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. గతం కంటే పోలింగ్ శాతం పెరగడంతో ఎన్నికల ఫలితాలు ఎవరికి అనుకూలంగా ఉంటాయన్న అంశంపై నియోజకవర్గంలో జోరుగా చర్చ సాగుతోంది. పోలింగ్‌లో సాగిన తీరును ప్రధాన పార్టీ అభ్యర్థులు తమకు అనుకూలంగా అన్వయించుకుంటూ విజయంపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు. 2004, 2009, 2019లలో మూడు సార్లు చీపురుపల్లి నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించిన తాజా మంత్రి బొత్స సత్యనారాయణ నాలుగోసారి కూడా తన గెలుపు ఖాయమని మొదటి నుంచి నమ్మకంతో ఉన్నారు. చీపురుపల్లి నియోజకవర్గంలో కూటమిదే విజయమని కూటమి అభ్యర్థి కిమిడి కళావెంకటరావు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన పథకాలతో పాటు నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధే తనను గెలుపిస్తుందని బొత్స సత్యనారాయణ ధీమాగా ఉన్నారు. కేంద్రంలో మోడీ చేపడుతున్న సంక్షేమ పథకాలు, టిడిపి, బిజెపి, జనసేన ప్రవేశ పెట్టిన ఉమ్మడి మేనిఫెస్టులోని సూపర్‌సిక్స్ పథకాలు, ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై ప్రచారం సాగుతున్న కొద్దీ ప్రభుత్వ అనుకూల ఓట్లలో చీలిక వచ్చిందని, ముఖ్యంగా యువత, ఉద్యోగ, ఉపాధ్యాయ, వర్గాలు తమకు అనుకూలంగా ఓటు వేసారనే నమ్మకం వంటివి తమకు లాభం చేకూరుస్తాయని టిడిపి అభ్యర్థి కళావెంకటరావు నమ్మకంతో ఉన్నారు.



పెరిగిన పోలింగ్ శాతం

నియోజకవర్గంలో 2019లో 80 శాతం ఓట్లు పోలయ్యాయి. ఈ సారి అది పెరిగి 83.48 శాతం కావడంతో కూటమి పార్టీ కాస్త ధీమాగా ఉండడమే కాకుండా పెరిగిన పర్సంటేజి తమకు కలిసి వస్తుందని ధీమా వ్యక్తం చేస్తోంది. నియోజకవర్గంలో 2,05,484 మంది ఓటర్లుండగా 1,71,533 మంది ఓటు హక్కుని వినియోగించుకున్నారు. గత ఎన్నికల కంటే ప్రస్తుత ఎన్నికలలో 3.48 శాతం మంది ఓటర్లు అదనంగా తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో గతంకంటే భిన్న పరిస్థితులు ఏర్పడడం వల్ల టిడిపికి అనుకూలంగా ఉంటుదని ఆ పార్టీ అభ్యర్థి కిమిడి కళావెంకటరావు, తాను చేసిన అభివృద్ధే తనను గెలిపిస్తుందని బొత్స సత్యన్నారాయణలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎవరు చీపురుపల్లి ఎమ్మెల్యే పీఠాన్ని అదిరోహిస్తారో జూన్ 4 వరకు వేచి చూడాల్సిందే.



పార్టీ కార్యాలయాల్లో బిజీ బిజీ

గుర్ల: టిడిపి, వైసిపి కార్యకర్తలు, నాయకులు మంగళవారం పార్టీ కార్యాలయాలలో బిజీ బిజీగా కనిపించారు. సోమవారం పోలింగ్ ముగియడంతో మొత్తం పోలైన ఓట్లులో తమ పార్టీకి ఎన్ని ఓట్లు వస్తాయి అని లెక్కలు వేసుకొని తమ అంచనాలపై చర్చించుకుంటున్నారు. 2019 సాధారణ ఎన్నికలలో గుర్ల మండలం నుంచి వైసిపికి 6,500 పైగా మెజారిటీ వచ్చింది. 2019 సాధారణ ఎన్నికలు మినహా గతంలో జరిగిన ఎన్నికలలో టిడిపికి ఎప్పుడూ మెజారిటీ వచ్చేది. ప్రస్తుతం జరిగిన ఎన్నికలలో ప్రభుత్వ వ్యతిరేకత వల్ల టిడిపికి 2వేల ఓట్లు మెజారిటీ వస్తుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు వల్ల తమ పార్టీకి గతంలో వచ్చిన మెజారిటికి వెయ్యి ఓట్లు అటుఇటుగా మెజారిటి వస్తుందని వైసిపి వర్గాలు భావిస్తున్నాయి. ఈ లెక్కలతో పాటు గ్రామాలలో మధ్యస్తంగా ఉన్న ఓట్లు ఏ పార్టీకి ఎక్కువగా వస్తే వారిదే మెజారిటి అని రాజకీయా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇరువర్గాలు ఓట్లు కోసం డబ్బులు, మద్యంను అందించి ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఇరు పార్టీలు నాయకులూ కార్యకర్తలు శక్తి వంచన లేకుండా పనిచేశారు. ప్రధానంగా వలస ఓటర్లును రపించడంలో గ్రామస్థాయి నాయకులు ఎక్కువ శ్రద్ధ కనబరిచారు. మంగళవారం ఉదయం నుంచి నియోజకవర్గ కేంద్రంలో కార్యకర్తలు తమ అభ్యర్థులకు ఓట్లు పోలింగ్ శాతంపై తమ పార్టీకి ఎన్ని ఓట్లు వస్తాయన్న లెక్కలను వివరించారు.

పెరిగిన పోలింగ్‌శాతం... అభ్యర్థుల్లో టెన్షన్

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి నియోజకవర్గంలో పోలింగ్ శాతం అనూహ్యంగా పెరిగింది. ఓటుహక్కును వినియోగించుకునేందుకు ఓటర్లు గంటల తరబడి క్యూలో ఉండి ఓట్లు వేశారు. కొన్ని పోలింగ్ కేంద్రాలలో రాత్రి 8గంటల వరకు క్యూలో ఉండి ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటర్లు కసితో ఓటు వేశారని కూటమి నేతలు ధీమా వ్యక్తం చేయగా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధికి మద్దతుగా ఓట్లు వేశారని వైసిపి నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఓటర్లు ఎవరు పక్షాన తీర్పు ఇచ్చారో జూన్ 4న తేలనుంది.

బొబ్బిలిలో 80.34శాతం పోలింగ్

నియోజకవర్గంలో 80.34 శాతం పోలింగ్ అయింది. నియోజకవర్గంలో 2,31,232 మంది ఓటర్లు ఉండగా 1,85,774 మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకున్నారు. బొబ్బిలి పట్టణం, మండలంలో 1,03,78 మంది ఓటర్లకు 81,282 మంది, బాడంగి మండలంలో 39,691మందికి, 32,508 మంది, రామభద్రపురం మండలంలో 38,371మందికి 32,135మంది, తెర్లాం మండలంలో 49,792మందికి 39,850మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకున్నారు.

తరలి వచ్చిన వలస ఓటర్లు

ఓటుహక్కును వినియోగించుకునేందుకు వలస ఓటర్లు తరలి వచ్చారు. ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాలలో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగులు ఓటు వేసేందుకు సొంత గ్రామాలకు చేరుకున్నారు. వలస కార్మికులంతా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓట్లు వేసినట్లు చర్చ జరుగుంది. నియోజకవర్గంలో మహిళలు ఓటింగ్ శాతం ఎక్కువ ఉంది. పెరిగిన మహిళ ఓటింగ్ వైసిపికి అనుకూలంగా ఉంటుందని పలువురు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యోగులు, కార్మికులు, నిరుద్యోగ యువత, వలస కార్మికులు ఓట్లు వేయగా సంక్షేమ పథకాలకు మద్దతుగా మహిళలు ఓట్లు వేసినట్లు చర్చ జరుగుతుంది.


కార్యకర్తలు, నాయకులతో చర్చిస్తున్న బేబినాయన

విజయం ఎవరిని వరిస్తుందో

నియోజకవర్గంలో ఎనిమిది మంది అభ్యర్థులు పోటీలో ఉన్నప్పటికీ ప్రధాన పార్టీలు వైసిపి, టిడిపి అభ్యర్థులు మధ్య పోటీ ఉంటుంది. 2014 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి తెంటు రాజాకు 76,629 ఓట్లు రాగా వైసిపి అభ్యర్థి సుజయకృష్ణ రంగారావుకు 83,587 ఓట్లు వచ్చి సుజయకృష్ణ రంగారావు 6,958 ఓట్లు మెజారిటీతో విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి శంబంగి వెంకట చిన అప్పలనాయుడుకు 84,955 ఓట్లు రాగా, టిడిపి అభ్యర్థి సుజయకృష్ణ రంగారావుకు 76,603 ఓట్లు వచ్చి వైసిపి అభ్యర్థి శంబంగి వెంకట చిన అప్పలనాయుడు 8,352ఓట్లు మెజారిటీతో విజయం సాధించారు. 2024 ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరగడంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓట్లు పడి కూటమికి అనుకూలంగా ఉంటుందని చర్చ జరుగుతుంది. నియోజకవర్గ ప్రజలు ఎవరికి పట్టం కడతారో జూన్ 4 వరకు వేచి చూడాల్సిందే.

బొబ్బిలిలో బేబినాయన విజయం ఖాయం

నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి బేబినాయన విజయం ఖాయమని మాజీమంత్రి సుజయకృష్ణ రంగారావు అన్నారు. కోటలో మంగళవారం ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలను సందర్శించిన సమయంలో మంచి స్పందన లభించిందన్నారు. ప్రజల ఆదరణ మరువలేనిదని చెప్పారు. బేబినాయనపై ప్రజలకు మంచి నమ్మకం కనిపిస్తుందని చెప్పారు. జూన్ 4న వెలువడనున్న ఫలితాల్లో ఎమ్మెల్యేగా బేబినాయన, ఎమ్‌పిగా కలిశెట్టి అప్పలనాయుడు అత్యధిక మెజారిటీతో విజయం సాధిస్తారని చెప్పారు.

కోటకు పోటెత్తిన టిడిపి కార్యకర్తలు

కోటకు టిడిపి కార్యకర్తలు, అభిమానులు పోటెత్తారు. నియోజకవర్గంలో సోమవారం జరిగిన ఎన్నికల ప్రక్రియను వివరించేందుకు ఉమ్మడి అభ్యర్థి బేబినాయన, మాజీమంత్రి సుజయకృష్ణ రంగారావును కలిశారు. పోలింగ్‌లో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా టిడిపికి ప్రజలు ఓట్లు వేశారని వారంతా చెప్పారు. సోమవారం జరిగిన ఎన్నికల్లో టిడిపి అత్యధిక మెజారిటీతో విజయం సాధిస్తుందని కూటమి నాయకులు, కార్యకర్తలు చెప్పారు. ఈ సందర్భంగా కూటమికి మద్దతుగా పని చేసిన టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలకు బేబినాయన, సుజయనాయన అభినందనలు చెప్పారు.

నెల్లిమర్లలో ఎవరి అంచనాలు వారివే

ప్రజాశక్తి - పూసపాటిరేగ

నెల్లిమర్ల నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. అయితే గెలుపుపై ఎవరి అంచానాలు వారు వేసుకుంటున్నారు. అభ్యర్థుల వద్దకు నాయకులు చేరుకొని మా గ్రామం, మండలం నుంచి ఇంత మోజార్టీ వస్తుందని చెబుతున్నారు. నియోజకవర్గంలో అధికార వైసిపి, కూటమి నువ్వా నేనా అన్న రీతిగా పోటీలో ఉండడంతో ఎవరి గెలిచినా 5 వేలు లోపు మోజార్టీయేనని అంటున్నారు. అయితే అధికార వైసిపి అనుకూల, ప్రతి కూల అంశాలను అభ్యర్థి వద్ద వివరిస్తున్నారు. నాలుగు మండలాల్లో స్వల్ప మెజార్టీ వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. ఐదు వేలుతోనైన గెలుస్తామంటూ అంచనా వేస్తున్నారు. అయితే డెంకాడ మండలం తప్పా మిగతా మూడు మండలాలు భోగాపురం, నెల్లిమర్ల, పూసపాటిరేగలో వైసిపికి ఎదురుదెబ్బ తగిలే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

భోగాపురం నుంచి వైసిపి కేంద్రకమిటీ సభ్యుడు కాకర్లపూడి శ్రీనురాజుతోపాటు మత్స్యకార సొసైటీ రాష్ట్ర సభ్యులు, సర్పంచులు వైసిపిని వీడడం అక్కడ ఇబ్బదేనని చెబుతున్నారు. పూసపాటిరేగ మండలంలోని ముగ్గురు సర్పంచులతోపాటు సర్పంచ్ స్థాయి నాయకులు వైసిపిని వీడారు. నెల్లిమర్ల మండలంలోని మిమ్స్ పోరాటం వైసిపికి ఇబ్బందులు కలిగించిందని అంచనా వేస్తున్నారు. ఈ తరుణంలో డెంకాడలో కూడా ఎంపిటి ఉపాధ్యాక్షులుతో పాటు కొంత మంది నాయకులు వైసిపిని వీడారు. వీటన్నింటితో పాటు మత్స్యకారులు ఎక్కువ శాతం జనసేనకు జైకొట్టారు. కొత్త ఓటర్లు ఎక్కువగా యువత ఉండడంతో వారు కూడా జనసేనకు జై కొట్టినట్లు తెలుస్తుంది. వీటన్నింటి కన్నా బలమైన నీడ నేత ఎమ్మెల్యే బడ్డుకొండ ఓటమికి గట్టిగా పనిచేశారు. ఈ నేపథ్యంలో వైసిపికి కొంత ఇబ్బంది ఎదురవుతొందని అంచనా.

అయితే వైసిపి మాత్రం తమకు మహిళా ఆశీర్వాదం ఉందని, సంక్షేమ పథకాలు తమను గెలిపిస్తాయని, గత ఎన్నికల్లో 29 వేల ఓట్లు మెజార్టీ ఉందని, తామే గెలుపు తీరుతామని అంటున్నారు. ఈ ఎన్నికల్లో అనూహ్యంగా బరిలోకి వచ్చిన కూటమి అభ్యర్థి లోకం మాధవి తనదైన శైలిలో టిడిపి మద్దతు కూడగట్టుకొంది. మొదట్లో కొంత ఇబ్బందులు పడినా చివరికి గెలుపు దిశగా అడుగులు వేయించింది. గత ఎన్నికల్లో ఆమెకు 7 వేలు ఓట్లు మాత్రమే వచ్చినా ఇప్పుడు కూటమి కలయడంతో ఆమె గెలుపు సునాయాశంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. భోగాపురం, పూసపాటిరేగ, నెల్లిమర్లలో మోజార్టీ ఓట్లు ఆమెకు పడ్డాయన్నది చర్చ జరుగుతోంది. కొత్తగా వచ్చిన 25 వేల యువ ఓటర్లు కూటమికి ప్లస్‌గా మారాయని అంచనా వేస్తున్నారు. గత ఎన్నికల్లో ప్రత్యర్థికి వచ్చిన 29 వేలు ఓట్లు అధిగమించి మరో 10 వేల ఓట్లు మెజార్టీ వస్తుందని అంచానా వేస్తున్నారు. ప్రభుత్వంపై వ్యతిరేక ఓటు ఆమెకు లాభంగా ఉందని అంచానాలో ఉన్నారు. ఏది ఏమైన ఎవరి అంచనాలు వారికి ఉన్నాయి.

కష్టపడిన కార్యకర్తలకు కృతజ్ఞతలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

సార్వత్రిక ఎన్నికలలో భాగంగా సోమవారం జరిగిన ఎన్నికల ఓటింగ్‌లో పార్టీల గెలుపునకు సహకరించిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు కూటమి అభ్యర్థి కోళ్ల లలిత కుమారి, వైసిపి అభ్యర్థి కడుబండి శ్రీనివాసరావు వేర్వేరుగా కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం లక్కవరపుకోట మండలంలోని కోళ్ల లలిత కుమారి నివాసం వద్దకు చేరుకున్న టిడిపి, జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అందరూ బాగా కృషి చేశారని టిడిపి విజయం సాధిస్తుందని ఆమె అన్నారు. కొత్తవలసలోని ఎమ్మెల్యే కడుబండి తన నివాసం వద్ద వైసిపి నాయకులు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు. మళ్లీ వైసిపి ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని తద్వారా కార్యకర్తల అభివృద్ధికి పెద్దపీట వేస్తామని ఆయన చెప్పారు.

ఎస్‌కోటలో 85.45 శాతం పోలింగ్ నమోదు

గతం కంటే పెరిగిన పోలింగ్ శాతం

సార్వత్రిక ఎన్నికలలో భాగంగా సోమవారం జరిగిన ఎన్నికల పోలింగ్ 85.45 శాతంగా నమోదయిందని ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ నారాయణమ్మ తెలిపారు. నియోజకవర్గంలో 2,22,475 మంది ఓటర్లు ఉండగా వీరిలో 1,90,104 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని ఓటుహక్కు వినియోగించుకున్న వారిలో పురుషులు 92,379 మంది, మహిళలు 97,724 మంది, ఇతరులు ఉన్నారని చెప్పారు. 2019 ఎన్నికలతో పోలిస్తే ఓటింగ్ శాతం పెరిగింది. 2019లో నియోజకవర్గంలో 2,12,623 మంది ఓటర్లు ఉండగా వీరిలో 1,82,199 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గతం కంటే ఓట్లు శాతం కూడా పెరగడంతో టిడిపి వైసిపి అభ్యర్థులు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.


ఎస్‌కోట: మాట్లాడుతున్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలితకుమారి

సహకరించిన ఓటర్లకు అభినందనలు : మీసాల గీత

విజయనగరం కోట : ఎన్నికల్లో తనకు సహకరించిన కార్యకర్తలు, అభిమానులు, ఓటర్లకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి మీసాల గీత తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ప్రచారంలో తనకు ఎంతో మంది ప్రజలు ఆదరాభిమానాలు చూపారని తెపారు. కార్యకర్తలు కూడా రాత్రి, పగలు అనే తేడా లేకుండా తన విజయం కోసం పాటుపడ్డారని తెలిపారు.

ప్రభుత్వ పాలనకు ఓటింగే నిదర్శనం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పాలన, ప్రభుత్వ సంక్షేమ పథకాలు చూసి ప్రజలు స్వచ్ఛందంగా ఓటింగ్‌లో పాల్గొన్నాని వైసిపి అభ్యర్థి, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. తన గెలుపుకోసం ఎన్నికల్లో పనిచేసిన నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో లంచగొండితనం లేని విధానాన్ని గమనించి, మేనిఫెస్టోను ఆమోదించి నందువల్లే పోలింగ్ సరళి పెరిగిందని ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. విజయనగరం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చూస్తే 8 నియోజకవర్గాలను వైసిపి కైవసం చేసుకుంటుందని తెలిపారు. విజయనగరంలో తనకు, పార్లమెంట్ స్థానంలో బెల్లాన చంద్రశేఖర్‌కు మంచి మెజార్టీ వస్తుందని తెలిపారు. 2019 ఎన్నికలలో ఎలా విజయావకాశాలు లభించాయో, అదే ఉత్సాహంతో పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ సహాయ సహకారాలు అందించారని అన్నారు. అన్ని వ్యవస్థలను మేనేజ్‌చేసే చంద్రబాబు ఎన్నికల ఏజెంట్ల గుర్తింపు కార్డులను కూడా పసుపురంగులో వచ్చే విధంగా ఎన్నికల అధికారులను ప్రలోభాలకు గురి చేయడం సరికాదన్నారు. ఎన్నికలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలుకు తావు ఇయ్యకుండా, ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు చేసిన కృషి ఎంతైనా అభినందనీయమని అన్నారు. సమావేశంలో పార్టీ జోనల్ ఇన్‌ఛార్జులు, పార్టీ పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు, పార్టీ ప్రజా ప్రతినిధులు, ఆయా విభాగాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కోలగట్ల వీరభద్రస్వామి

ఫోర్టుసిటీ విద్యార్థుల విజయకేతనం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సిబిఎస్ఇ టెన్త్ పరీక్షా ఫలితాలలో ఫోర్టు సిటీ పాఠశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. సీపాన తీక్షణ 500 మార్కులకు 485 మార్కులతో పాఠశాల ప్రథమ స్థానాన్ని, ఎన్ఎంఎన్ వరుణ్ మైలవరపు 484 మార్కులతో ద్వితీయ స్థానాన్ని దక్కించుకున్నారు. శతశాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుండా పరీక్షకు హాజరైన 66 మంది విద్యార్థులలో 63 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కెఎపిరాజు (శివ) మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు పదవ తరగతి స్టేట్ పరీక్షా ఫలితాలలో మాత్రమే కాకుండా సిబిఎస్ఇ పరీక్షా ఫలితాలలో కూడా మంచి మార్కులు సాధించడం గర్వంగా ఉందన్నారు. చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపల్ డాక్టర్ రోయినా ఖాన్, డైరెక్టర్లు మధు, అశోక్, నీలిమ విద్యార్థులను, తల్లిదండ్రులను, పాఠశాల సిబ్బందిని అభినందించారు.

సిబిఎస్‌సి ఫలితాల్లో ప్రతిభ

రామభద్రపురం: సిబిఎస్‌సి బోర్డ్ విడుదల చేసిన ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన గ్లోబల్ వ్యూ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. స్కూల్ చైర్మన్ పోల వెంకట రమణ తెలిపిన వివరాల మేరకు.. గెంజి భరత్ 97శాతంతో 500కి 482 మార్కులు సాధించి డివిజన్ స్థాయిలో మొదటి ర్యాంకు, జిల్లా స్థాయిలో రెండవ ర్యాంకు సాధించారన్నారు. ముగడ వీరనాగ సోనాలి 476, పోల నిమీష 451 మార్కులు సాధించి ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారన్నారు. ఇక్కడ నుంచి 21 మంది పరీక్షలు రాయగా శత శాతం ఉత్తీర్ణత సాధించి సుమారు 11 మంది విద్యార్థులు 400లకు పైబడి మార్కులు సాధించడం తమ పాఠశాలకు గర్వకారణం అన్నారు. ముగ్గురు విద్యార్థులకు తెలుగు సబ్జెక్టులో 100 కి 100 మార్కులు రావడం తెలుగు భాషపై ఉన్న ప్రతిభకు అద్దం పడుతుందన్నారు. ఇంతటి మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు స్కూల్ చైర్మన్ వెంకట రమణ, కరస్పాండెంట్ పోల వెంకట చంద్ర మోహన్, ప్రిన్సిపాల్ ఈ.సంధ్య ఉపాధ్యాయ సిబ్బంది మంగళవారం అభినందనలు తెలిపారు.


ఎం. వీరనాగ సోనాలి పోల నిమీష జి. భరత్‌కుమార్



తీక్షణను అభినందిస్తున్న పాఠశాల చైర్మన్ కెఎపి రాజు